
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 243 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.31.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈగల్, హైడ్రా తరహాలో అది పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆహార కల్తీ నియంత్రణకు దేశంలోని అన్ని చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు. పంటలకు ధర నిర్ణయించే అవకాశం రైతులకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు.



నిత్యావసరాలను అక్రమంగా నిల్వ చేయటమనేది హత్యానేరం కంటే ఎక్కువని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించామని తెలిపారు. అందువల్లే సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఈ ప్రక్రియకు ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం 86 శాతం మంది ప్రజలు, అంటే 3.36 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని వివరించారు. భవిష్యత్‌లో ఇది 90 శాతం కూడా కావచ్చని చెప్పారు. రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా 40 ఏండ్లుగా దొడ్డు బియ్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు వాటి స్థానంలో సన్న బియ్యం ఇస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని వివరించారు. రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చామని పేర్కొన్నారు. రైతులకు లాభం చేకూర్చడంతోపాటు పేదల ఆకలిని సైతం తీరుస్తున్నామని అన్నారు. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గిందని చెప్పారు. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

ఇందులో భాగంగా వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఇదే తరహాలో రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీఎం తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లను పెంచితే దక్షిణ భారతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అదే జరిగితే దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం పెరుగుతుందని హెచ్చరించారు. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటుచేసుకోవడానికి అవకాశమేర్పడు తుందని వివరించారు. సీట్ల సంఖ్యను పెంచిన తర్వాత.. వాటి మధ్య అంతరం కూడా అదే విధంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనేది పార్టీల సమస్య కాదని వ్యాఖ్యానించారు.

50 శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. దీనిపై పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలని సూచించారు. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే తన ఉద్దేశమని అన్నారు. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే, అది ఎంతకాలమో కొనసాగదని పేర్కొన్నారు. జాతీయ పార్టీ అయినప్పటికీ దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ తమకు ఉందన్నారు. లోక్‌సభలో రాష్ట్రాల వారీగా ఇప్పుడున్న సీట్ల సంఖ్య, నిష్పత్తి తగ్గొద్దని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై గతంలో ఇండియా కూటమి తరపున చెన్నైలో మీటింగ్ పెట్టాం..త్వరలో తెలంగాణలో కూడా పెడతామని వెల్లడించారు.

డీలిమిటేషన్‌పై బండి సంజయ్, లక్ష్మణ్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. వారు ఇదే విధంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో ఉన్న ఎంపీ పదవులు కూడా ఊడతాయని హెచ్చరించారు.

**కేసీఆర్ లేకపోతే నేను లేను...**

కేసీఆర్ లేకపోతే తాను లేనని.. ఆయన వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. మహాభారతంలో శకుని లేకుంటే కృష్ణుడు లేనే లేడని, రావణాసురుడు లేకుంటే రాముడు ఎవరికి తెలుసని ప్రశ్నించారు. కేసీఆర్ రెస్ట్ తీసుకుంటున్నారని అందరు అనుకుంటున్నారు.. కానీ ఆయన్ను కేటీఆర్, హరీశ్ కలిసి గృహ నిర్బంధం చేశారని సెటైర్లు వేశారు. కాలనాగుకంటే హరీశ్ ఎంతో ప్రమాదకరమని విమర్శించారు.

**ఆ క్రెడిట్ సీఎందే : ఉత్తమ్**

సన్న బియ్యం పథకం క్రెడిటంతా సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ అన్నారు. సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. దీంతో పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది ప్రజలకు సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. ఆహార భద్రతా చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఎంత ఖర్చయినా ఫరవాలేదు.. సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతు భరోసా కింద రైతుల ఖాతాలో ఇప్పటివరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకు వేస్తున్నామని వివరించారు.

**సన్నబియ్యంతో సీఎం భోజనం**

రాష్ట్రంలో పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు శాసనసభ సెంట్రల్ హాల్‌లో సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తోపాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సందర్భంగా భోజనం చేశారు. మీడియాకు సైతం అదే సన్నబియ్యంతో భోజనం పెట్టారు.

## మావోయిస్టు రహిత ప్రాంతంగా బస్తర్



న్యూఢిల్లీ బ్యూరో :అమృత్ తెలంగాణ: బస్తర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటించారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేతకు మార్చి 31 డెడ్‌లైన్ అని తెలిపారు. బస్తర్‌లో ప్రస్తుతం మావోయిస్టులు లేరని, మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వెల్లడించారు. బస్తర్‌లో ఆదివాసీలకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం ముందుకెళ్తోందని తెలిపారు.

అలాగే మావోయిస్టుల లొంగుబాటుకు నేడు (మంగళవారం) చివరి తేదీ అని, అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదని అమిత్‌షా హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని, వారి పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. గిరిజనులను 60ఏండ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిస్టులు పెరిగారని, 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆయన మండిపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని.. తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని తెలిపారు.

## కాళేశ్వరం పేర రూ.లక్ష కోట్లు నీళ్లపాలు



న్యూఢిల్లీ అమృత్ తెలంగాణ:గత బీఆర్ఎస్ సర్కార్ దాదాపు రూ. లక్ష కోట్లకుపైగా నిధులతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నీళ్ల పాలైందని కేంద్ర జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్ విమర్శించారు. రూ. 30 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ అప్రూవల్ కోసం తమ మంత్రిత్వ శాఖను ఆశ్రయించిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం టెక్నికల్ అప్రైజల్ కమిటీ(టీఏసీ) అనుమతి మాత్రమే ఇచ్చిందని, నిధులు ఇవ్వకపోవడం మంచిదైందని అన్నారు. ఈ మేరకు సోమవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల్లో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్ వై) కింద తెలంగాణలో నీటి పారుదల ప్రాజెక్టుల అభివృద్ధిపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.

"కాగ్ రిపోర్ట్‌లు రాష్ట్రానికి వెళ్తాయి. ఈ రిపోర్ట్‌లకు రాష్ట్రాలే జవాబుదారీగా ఉంటాయి. అయితే కాళేశ్వ రానికి సంబంధించి రాష్ట్రం నుంచి ఎలాంటి కాగ్ రిపోర్ట్ తమకు అందలేదు" అని స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ నిధుల వినియోగం లో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరించిందన్నారు. ఈ స్కీం కింద రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి తీసుకోనందున, దీనిపై తమ మంత్రిత్వ శాఖ వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు.

## స్థానికత నిబంధనల్లో సమూల మార్పులు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: స్థానికత నిబంధనల్లో సమూల మార్పులు చేయాలని తెలంగాణ జాగతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయడానికంటూ అప్పటి సీఎస్ శాంతికుమారితో వేసిన సబ్ కమిటీ నివేదికను బయపెట్టాలని ఆమె కోరారు. బాధితులకు కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికత కోసం 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేండ్లు తెలంగాణలో చదివితే చాలంటూ తెచ్చిన నిబంధనతో స్థానికులకు అన్యాయం జరుగుతుందనీ, అవకాశాలు కోల్పోతున్నారని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. దాని బదులుగా గతంలో మాదిరిగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు మధ్యలో ఏడేండ్లు తెలంగాణలో లేదా సంబంధిత జిల్లాలో చదివితేనే స్థానికత అనే నిబంధననే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తద్వారా తెలంగాణ బిడ్డలకు న్యాయం జరుగుతుందని కవిత తెలిపారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద న్యాయం చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కొత్త జిల్లాలకు ఉద్యోగులను సర్దుబాటు చేయడానికంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చినజీవోనెంబర్317తోఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అధికారంలోకి రాగానే ఆ జీవోను రద్దు చేస్తామని పీసీసీ హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని కవిత గుర్తుచేశారు. బాధితుల పరిష్కారం కోసమంటూ తెచ్చిన జీవో నెంబర్లు 243, 244, 245తో స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉపశమనం దక్కలేదని తప్పుపట్టారు. ఇప్పటికే 20 వేల మంది రిటైర్ అయ్యారనీ, ఆయా ఖాళీ స్థానాల్లో నిరుద్యోగులకు నష్టం జరగకుండా బాధితులకు పోస్టింగ్ ఇచ్చేలా ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ప్రజాస్వామ్యం గొంతు నొక్కేందుకే 'హేట్ స్పీచ్' బిల్లు

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కేందుకే 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'ను ప్రభుత్వం తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. పౌర స్వేచ్ఛను హరించే ఆయుధంగా ఆయన ఈ బిల్లును అభివర్ణించారు. ఇది చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, బిల్లులోని నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయని విమర్శించారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం' 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు న్యాయ పరిమితులు లేవని ఎత్తిచూపారు.

## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆయన అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సోమవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సాక్ష్యాధారాలను అందజేసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అక్రమాలపైన స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలనీ, లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని తెలిపింది. జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడిందని విమర్శించింది.

సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతి లేకుండా రెండేండ్లుగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టిందని వివరించింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరితే సభ నుంచి తమను ప్రభుత్వం బహిష్కరించిందని తెలిపింది. అనంతరం మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. శాసన సభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని చెప్పారు.

మంత్రి పొంగులేటి రూ.వందల కోట్ల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జరిపిస్తామంటున్నారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా హోంమంత్రి బాధ్యతల్లో ఉన్నపుడు సీబీసీఐడీ విచారణ లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా స్వతంత్ర న్యాయ విచారణ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు వివరించామన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ దోపిడీని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని చెప్పారు. బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.


రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్‌ను రూట్ టు ఇన్‌కంగా ఆయన మార్చుకున్నారని వివరించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆయనకు తెలిసినంతగా ఈ దేశంలో మరెవరికీ తెలియవన్నారు. 14 అంశాలపై విచారణ చేయాలంటూ సీఎంకు లేఖ రాశామని గుర్తు చేశారు. వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే పొంగులేటిని బర్తరఫ్ చేసి విచారణ జరపాలన్నారు. మంత్రిగా ఉన్నందున ఆయన విచారణను ప్రభావితం చేసే అవకాశముందని చెప్పారు.

# కమనీయం రమణీయం గోదూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

ఓడిభియ్యం సమర్పించిన మహిళలు
స్వామివారికి పంచామృత అభిషేకాలు
వేధమంత్రో చరణ మధ్యయజ్ఞ పుర్ణహృతి చేసిన అర్చకులు
అంగరంగ వైభవంగా వాడవాడకు స్వామి వారి పల్లకి సేవ
అలయ కమిటీ, అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం
స్వామి వారికి ప్రత్యేక మోక్కులు చెల్లించుకున్న భక్తులు







ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ మార్చి 30 జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదూర్ గ్రామంలో ప్రతి సవత్సరం వార్షికంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంరోజు నుండి ప్రారంభమైయి. అంగ రంగ వైభవంగా జరుగుతున్నవి. సోమవారం గ్రామస్తులు దాతల సహకారం తో దేవలయకమిటీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం యజ్ఞ అర్చకులు , స్థానిక ఆచార్యులు ల కరకములచే స్వామి వారి కళ్యాణం జరిగింది. ముడు రోజులు గా స్వామి వారి అలయం లో లోక కళ్యాణం కోసం జరుగుతున్న యజ్ఞం పుర్ణహృతి చేశారు. అనశీతరం అలయం లో ఆదివారం రోజున ఉదయం 5 గంటలకు సుప్రభాతం నిత్యారాధన ఉత్సవ ఆరంభ స్వపనం విశ్వక్సేనారాధన స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, బ మృత్సం గ్రహణం, అంకురారోపణం అఖండదీపారాధన, యాగశాల ప్రవేశం చతుస్థానార్చన దేవత ఆహ్వానం, అగ్ని ప్రతిష్ట నిత్య పూర్ణాహుతిధ్వజరోహణం, మంగళ శాసనం, సాయంత్రం ద్వార తోరణ పూజ ,ధ్వజ కుంభారాధన, నిత్య హోమము, వేద స్వస్తి బలీహరణ, నిత్య పూర్ణాహుతి తీర్థ ప్రసాద వినియోగం అలయ బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు సోమవారము ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ ,బాలా భోగ నివేదన ,యాగశాలలో ద్వారా తోరణం, ఆరాధన, శాంతి పాఠం సంకల్పం నిత్య హోమం, నిత్య పూర్ణాహుతి తరువాత స్వామి వారిని ప్రత్యేక పల్లకి లో బజాబజంత్రిలతో ఎదుర్కొంటూ మండపంలో పంచామృత అభిషేకం నిర్వహించి వేద మంత్రోచ్ఛరణల మధ్య ,కల్యాణ మండపంలో కోలువుదిర్చి శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి అలివేలు మంగమ్మల కు కళ్యాణం నిర్వహించారు. కళ్యాణం అనశీతరం మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. భక్తులు ప్రత్యేక మో క్కులు చెల్లించు కున్నారు. దేవలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. అలయం వేంకటేశ్వర స్వామి వారిని భక్తులు ప్రత్యేక పుజలు నిర్వహించారు. సాయంత్రము డోలోత్సవము తెప్పోత్సవము నిత్య హోమాది కార్యక్రమాలు స్వామివారి గ్రామోత్సవము కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగినాయి ఈకార్యక్రమంలో సర్పంచ్ బండి రాజేష్ ఉపసర్పంచ్ ఓంకారీ రాము , ఆలయ కమిటీ అధ్యక్షులు తైదపెల్లిరాజు , వి డి సి చైర్మన్ పడాల రాజన్, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు, తహసిల్దార్ వరప్రసాద్, మండల విద్యాధికారి బండారి మధు, మాజీ సర్పంచులు వేముల లింగారెడ్డి సోమ ప్రభాకర్ , జాజాల భీమేశ్వరి జగన్ రావు, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, వెంకట స్వామి, ప్రసాద వితరణలో ఆంజనేయ స్వాములు, బండి గోపాల్ ,కోటగిరి మురళి,సురేష్ రాజగోపాల్ పవన్ శీడ్డం శీను మాదం రాజేందర్ సోమ శ్రీనివాస్ కట్ట శ్రీనివాస్ కుల సంఘ సభ్యులు ఆంసంగం సభ్యులు, భక్తులు, మహిళలు గ్రామ యువకులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

పోలీసుల పట్ల నమ్మకం పెరిగేలా విశ్వాసం కలిగించాలి.
పోలీసు ముఖ్య కార్యాలయం నందు 28 ఫిర్యాదుల స్వీకరణ
ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు.
ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాల సమాచారం
8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలి.
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రతి సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించే ప్రజా ఫిర్యాదులను కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారుల దయచేసి తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియజేశారు. సమస్యలను విన్న జిల్లా ఎస్పీ పేరుగా సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి శాశ్వత పరిష్కారాలు చూపాలని, బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 28 ఫిర్యాదులను సేకరించడం జరిగింది. వచ్చిన ఫిర్యాదులలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అసంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. గంజాయి, గుడుంబా, పేకాట, మాదకద్రవ్యాలు, ఎలాంటి వాటిపైన అయిన సమాచారం అందించవచ్చు. ఈ వాట్సాప్ నంబరు నేరుగా జిల్లా ఎస్పీ గారికి నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవార్డులు అధికారుల కృషికి కొలమానాలని రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ అవార్డులు అధికారుల కృషికి కొలమానాలని రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇటీవలే నిర్మల్ జిల్లాకు రెండు స్కోచ్ అవార్డులు లభించినందున, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాదులో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు రెండు విభాగాల్లో స్కోచ్ అవార్డులు లభించడం ఎంతో గర్వకారణం అని మంత్రి ప్రశంసించారు. పొనికివనం, ఏర్పాటు అమ్మ రక్షిత కార్యక్రమం అమలు విజయవంతంగా కొనసాగిస్తున్నందుకు అధికారులను మెచ్చుకున్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లాలో వినూత్న కార్యక్రమాలు అమలుపరిచేందుకు ప్రోత్సాహం అందిస్తూ, మార్గ నిర్దేశం చేసిన ముఖ్యమంత్రికి, మంత్రి జూపల్లి, సీతక్క, దామోదర రాజనరసింహ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తదితరులు ఉన్నారు.

# జనగణన పకడ్బందీగా జరగాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. 'జనగణన నుండి జన కల్యాణం' అనే నినాదంతో ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్థానిక టీటీడీసీలో శనివారం ప్రారంభమై సోమవారంతో ముగిసిన 'సెన్సస్–2027' ఫీల్డ్ ట్రైనర్ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో కలెక్టర్ పాల్గొని ట్రైనర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ గణనలో ప్రతి వ్యక్తి వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గణన నిర్వహించే సిబ్బందికి ఫీల్డ్ ట్రైనర్లు సమగ్ర అవగాహన కల్పించాలని అన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహించనున్న ఈ ప్రక్రియలో సాంకేతిక అంశాలపై పూర్తి పట్టు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ట్రైనింగ్ కలెక్టర్ సలోని చాబ్రా, పర్యవేక్షకులు నలంద ప్రియ, మాస్టర్ ట్రైనర్లు కె. శ్రీహరి బాబు, యువరాజ్, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలి : డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేరి




అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మార్చి 30, 2026: జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో జనగణన, ఇండ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారాహోచేపట్టడం జరుగుతుందని, మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, సన్నాహక పనులు మొదలు పెట్టాలని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. చార్జెస్ (మండలాల) వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, 300 ఇళ్లకు / 750-800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్ ను నియమించాలని, ఎన్యుమరేటర్ బ్లాక్/ హౌస్ లిస్టింగ్ బ్లాక్ తయారు చేయాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారుగా 1 వేయి 899 మంది (10 శాతం అదనం తో కూడిన) ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికారి పాపయ్య, ఉపగణాంక అధికారి, అదనపు జనగణన అధికారి రాజేందర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్లకు సమర్పించారు. ఈప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ 13వ పటాలం కమాండెంట్

అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మార్చి 30, 2026:జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట లో గల టి జి ఎస్ పి 13వ పటాలం లో ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పటాలం కమాండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. దోభీ, కుక్ పోస్టుల కొరకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థి ఎలాంటి క్రిమినల్ కేసులలో ఉండకూడదని (సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి ధ్రువపత్రం సమర్పించాలి), మంచిర్యాల జిల్లా, గుడిపేటకు చెందిన వారికి, పోలీస్ గా మృతి చెందిన, పదవీ విరమణ పొందిన కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత, కులం, నివాసం ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, అనుభవ పత్రాలు సమర్పించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 6వ తేదీలోగా కార్యాలయానికి చేరుకునే విధంగా సమర్పించాలని తెలిపారు.

## ఆదిలాబాద్ జిల్లా సహకార శాఖ ఇంచార్జి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మాదా సత్యనారాయణ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లా సహకార శాఖ ఇంచార్జి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మాదా సత్యనారాయణ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.జిల్లాలో సహకార రంగ అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, ప్రస్తుత కార్యక్రమాల అమలు తదితర అంశాలపై కలెక్టర్ తో చర్చించారు. సహకార సంఘాల బలోపేతానికి, పారదర్శకంగా సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని మాదా సత్యనారాయణ పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధిలో సహకార శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, రైతు సంక్షేమానికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

## ఫీజుల పెంపుదలపై విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన..



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేటలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు పెంచడంపైఆందోళన చేపట్టారు.సోమవారం ఉదయం పాఠశాల ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి యేటా 15% ఫీజులు పెంచడం, మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా పాఠశాల యాజమాన్యంఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల తల్లిదండ్రులపై విపరీతమైన భారం పడుతుందని వారు తెలిపారు. ఐదవ తరగతి నుండి ఆరవ తరగతి విద్యార్థులకు 35% ఫీజు పెంపుదల అన్యాయమని పేర్కొన్నారు. ఒకపక్క ప్రభుత్వం ఫీజునియంత్రణపైచట్టాలు తీసుకువచ్చే కృషి చేస్తుండగా విద్యాశాఖ ఉన్నతాధికారులు బాధ్యులుగా ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఫీజుల పెంపుదలను ఉపసంహరించాలని, విద్యార్థులకు అన్ని రకాల ఆటల పోటీలలో నైపుణ్యాలు పెంచే కృషి చేయాలని దానికి అదనపు ఫీజులు వసూలు చేయకూడదని విన్నవించారు. ఫీజుల పెంపుదల మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, తల్లిదండ్రులకు భారం పడే విధంగా కాకుండా ఉంటే తల్లిదండ్రులు కూడా సహకరిస్తారని పేర్కొన్నారు. స్కూల్లో వసూలు చేసే ఫీజులు నిబంధనల ప్రకారంవివరాలుఅందజేయాలని,పెంచే ఫీజులకు సరైన పద్ధతులు, విధానాలు ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో టీచర్లు, యాజమాన్యం సమన్వయం చేసుకోవడానికి పేరెంట్స్ టీచర్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం తల్లిదండ్రుల తరపున ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేశారు.

స్పందించిన ప్రిన్సిపల్

ప్రభుత్వ అధికారుల సమన్వయంతో నడుస్తున్న పాఠశాలలో ఎటువంటి అవకతవకలకు అవకాశం లేదని అన్ని నిబంధనల మేరకు అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళననేపథ్యంలో ఫీజుల విషయాన్ని సొసైటీ దృష్టికి తీసుకువెళ్లి తగినవిధంగానిర్ణయం తీసుకోవడంలో కృషి చేస్తానని పేర్కొన్నారు.

## క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపికలు పూర్తి
## జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా మార్చి 30, 2026:తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలలలో ప్రవేశం కొరకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా మైదానం (జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వెనుక, బస్టాండ్ సమీపంలో) లో నిర్వహించగా, ఆన్ లైన్ లో ముందస్తుగా నమోదు చేసుకున్న అర్హులైన విద్యార్థులు పాల్గొన్నారని, ఎంపికలలో భాగంగా అభ్యర్థులకు శారీరక కొలతలు (ఎత్తు, బరువు), మోటార్ నైపుణ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6 ఐ 10 మీటర్ల షటిల్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 1 కిలో మెడిసిన్ బాల్ పుట్, 800 మీటర్ల పరుగుతో పాటు వైద్య పరీక్షలు (ఏజ్ వెరిఫికేషన్) నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు


## మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం

భువనగిరి కలెక్టరేట్ అమృత్ తెలంగాణ: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ సంఘాల నాయకుల ద్వారా వారి తెలియజేసిన సలహాలు, సూచనలను స్వీకరించారు.ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాలను ఒక పండుగ వాతావరణంలో జిల్లాలో ఏప్రిల్ 5 న బాబు జగ్ జీవన్ రామ్ జయంతి ,ఏప్రిల్ -11న జ్యోతిబా పూలే , మరియు ఏప్రిల్ -14 డా.,బి. ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున వివిధ శాఖల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అందరి సహకారంతో సామరస్యంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు.

## సీఐటీయూ అధ్వర్యంలో ఆశా వర్కర్ల రాస్తారోకో..ఉద్రిక్తత

హైదరాబాద్ : ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం 18 వేలు ఇవ్వాలని నేడు సీఐటీయూ అధ్వర్యంలో వందలాది మంది ఆశా వర్కర్స్ జడ్చర్ల నెషనల్ హైవే 44పై రాస్తారోకో నిర్వహించారు.దాదాపు2 గంటలఈ రాస్తారోకో చేశారు.దీంతో10 కిలో మీటర్ల దూరం పాటు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల జోక్యంతో తోపులాట జరిగింది.ఈ ఘర్షణలో సీఐటీయూఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి స్పృహ తప్పి పడిపోయారు.దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇంకా ఈ ఘటనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దీప్లా నాయక్, ఉపాధ్యక్షుడు సత్తయ్య, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సావిత్రి, సాధన, తదితరులకు గాయాలు అయ్యాయి.

## బికినీలో నాగిని బుసలు కొడుతోందే!



బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ హాటెస్ట్ ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆందాల ఆరోబోతలో అమ్మడు ముందు వరుసలో ఉంటుంది. పూల్ సైడున టూపీస్.. స్విమ్ షూట్ బికీనీల్లో చేసే రచ్చ అంతా ఇంతా కాదు. తెరచిన పుస్తకం వలే బ్యూటే అందాలు ఆరబోస్తుంది. ఇసుక తిన్నుల్లో అందాల ఆరబోతతో ఇసుక తుఫాల్నే రప్పిస్తుంది. సందర్భం ఏదైనా మౌని టెంప్టింగ్ ఫోజులకు ఫ్లాట్ అవ్వాల్సిందే. అంతగా గ్లామర్ ఎలివేషన్ పై దృష్టి పెడుతుంది. తాజాగా అమ్మడు మరోసారి టూపీస్ లో చెలరేగిపోయింది. రిసార్ట్ లోఅమ్మడు పూల్ సైడున పువ్వుల పీస్ లో అందాల విందు చేసింది. థై అందాలు..నాభి అందాల ఎక్స్ ఫోజ్ ని పీక్స్ కి తీసుకెళ్లింది. గాల్లోకి ఎగురుతూ మరీ క్యామ్ ఫోజులిచ్చి అమ్మడి అందాలు ఎలివేట్ చేస్తోంది. ఇక రిసార్ట్ గదిలో బ్రౌన్ కలర్ డిజైనర్ దుస్తుల్లోనూ నాగిని తళుక్కున మెరిసింది. టూపీస్ లో పోలిక కాస్త కష్టమైనా గోధుమ రంగు దస్తుల్లో క్లోజ్ సెల్ఫీ షాట్ లో నాగిని అవతరామే ఎత్తింది. ప్రస్తుతం ఈ రెండు ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. నెటిజనులు హాట్ కామెంట్లతో ఎటాకింగ్ దిగారు. మౌని రాయ్ మల్టీట్యాలెంటెడ్ గాళ్. మోడలింగ్ నుంచి గాయనిగా అటుపై నటిగా ఫేమస్ అయింది. సినిమా లకన్నా ఎక్కువగా టీవీషోలతోనే మౌనీరాయ్ ఫోకస్ అయింది. పాప్ ఆల్బమ్ సింగర్ గాను మౌని మెరుపులు మెరిపించిం ది. అయితే నటిగా మాత్రం నిలదొక్కుకోలేదు. బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ అవి యాక్టింగ్ అంతగా స్కోప్ లేని చిత్రాలుగానే ఉన్నాయి. కేజీఎఫ్ చాప్టర్ -1లో స్పెషల్ అప్పీరియన్స్ తో సౌత్ లో కొంచెం పేరొచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్ లో బ్రహ్మాస్త్ర లో నటిస్తుంది. ఇది మౌని కెరీర్ లో బిగెస్ట్ ఫిల్మ్. అమితాబచ్చన్..నాగార్జున ..రణబీర్ కపూర్ ..అలియా భట్ .. డింపుల్ కపాడియాతో కలిసి మౌని తెరను పంచుకుంటుంది. బ్రహ్మాస్త్ర మౌనీ రాయ్ కెరీర్ ని టర్న్ చేసే చిత్రంగానే భావించొచ్చు. ప్రాజెక్ట్ పై అమ్మడు భారీగానే ఆశలు పెట్టుకుంది.

## కృతి శెట్టి.. శ్రీలీలా ఇప్పుడు మృణాల్ ఠాకూర్

ఉప్పెన సినిమా విడుదలకు ముందే కృతి శెట్టి కి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. ఆ సినిమా కరోనా వల్ల ఆలస్యం అవ్వడంతో కృతి శెట్టి కెరీర్ ఏమవుతుందో అనే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. కాని ఉప్పెన ఆలస్యంగా వచ్చిన సూపర్ హిట్ సాధించింది. ఉప్పెన విడుదలకు ముందు నుండే వచ్చిన ఆఫర్లు విడుదల తర్వాత మరింతగా ఎక్కువ అయ్యాయి. ప్రస్తుతం కృతి శెట్టి ఇండస్ట్రీలో ఎన్ని సినిమాల్లో నటిస్తుందో.. ఎన్ని హిట్స్ దక్కాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక పెళ్లిసంద సినిమా తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన క్యూటీ శ్రీ లీలా. ఆ సినిమా ఫ్లాప్ అయినా కూడా శ్రీలీలా బిజీ బిజీగా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. పెళ్లిసంద సినిమా విడుదలకు ముందు నుండే శ్రీ లీలా సందడి మొదలు అయ్యింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా ఆ జాబితాలో చేరింది. బాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన మృణాల్ తెలుగు లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్దం అయ్యింది. తెలుగు సినిమా విడుదలకు ముందే ఈమె సోషల్ మీడియా లో షేర్ చేసిన ఫోటో ల ద్వారా ఇక్కడ కూడా పాపులారిటీని దక్కించుకుంది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సీతారామం తో తెలుగు ప్రేక్షకుల



ముందుకు మృణాల్ రాబోతుంది. ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్ లుక్ తో తెలుగు ప్రేక్షకులను ఈ అమ్మడు అలరించింది. ముందు ముందు ఈ అమ్మడికి టాలీవుడ్ లో మంచి అవకాశాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న తరుణంలోనే పలువురు టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ ఈ అమ్మడి కాంటాక్ట్ కు ప్రయత్నాలు చేస్తున్నారట. సీతారామం విడుదల అయ్యే సమయం కు మృణాల్ చేతిలో మరో రెండు మూడు సినిమాలు ఉండే అవకాశం ఉంది. హను రాఘవపూడి హీరోయిన్స్ ను చాలా అందంగా విభిన్నమైన పాత్రల్లో చూపించి వారు జనాల్లో నోటెడ్ అయ్యేలా చేస్తాడు. కనుక సీతారామం సినిమా తో మృణాల్ కూడా ఖచ్చితంగా టాలీవుడ్ లో నోటెడ్ అవ్వబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. హీరోయిన్ గా బాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే టాలీవుడ్ లో కూడా టాప్ స్టార్ హీరోయిన్ గా ఈ అమ్మడు పేరు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగిన 'డ్రైవర్ జమున' జర్నీ..!

కోలీవుడ్ లో హీరోయిన్ గా రాణిస్తున్న ఐశ్వర్య రాజేష్.. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లో మెపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆమె నటుడు రాజేష్ కుమార్తె.. హాస్యనటి శ్రీలక్ష్మి మేనకోడలు. పలు డబ్బింగ్ చిత్రాలతో పలకరించిన ఈ భామ.. 'కౌసల్య కృష్ణమూర్తి' అనే సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ఈ క్రమంలో మిస్ మ్యాచ్' 'వరల్డ్ ఫేమస్ లవర్' 'టక్ జగదీశ్' 'రిపబ్లిక్' వంటి సినిమాలో మెరిసింది. ఇప్పుడు "డ్రైవర్ జమున" అనే చిత్రంతో అలరించడానికి రెడీ అయింది. ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో పి.కిన్ స్లిన్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా సినిమా "డ్రైవర్ జమున". ఇందులో ఆమె ఒక క్యాబ్ డ్రైవర్ గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన




ఫస్ట్ లుక్ ఈ చిత్రంపై ఆసక్తిని కలిగించింది. ఈ నేపథ్యంలో తాజాగా టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్ దగ్గుబాటి సురేశ్ బాబు ట్రైలర్ ను రిలీజ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన జమున అనే ఓ లేడీ క్యాబ్ డ్రైవర్ జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో.. ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారని అర్థం అవుతోంది. ట్విస్టులు కీలక మలుపులతో ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగిన 'డ్రైవర్ జమున' ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఆడపిల్లలు డ్రైవింగ్ ఫీల్డ్ లో చాలా కష్టపడతారు అని ఇంట్లో వాళ్ళు వారిస్తున్నా.. అవేవీ లెక్క చేయకుండా జమున క్యాబ్ డ్రైవర్ గా వెళ్ళింది.




## హీరోయిన్ రేంజ్ అందాల ఆరబోత



తెలుగు బిగ్ బాస్ నాన్ స్టాప్ లో కొన్ని వారాల పాటు ఎంటర్ టైన్ చేసిన స్రవంతి తనదైన శైలి రాయలసీమ యాస తో ఆకట్టుకుంది. బుల్లి తెరపై సుదీర్ఘ కాలంగా కనిపిస్తూ వస్తున్న ఈమె బిగ్ బాస్ తో మరింత పాపులారిటీని దక్కించుకుంది. బిగ్ బాస్ తో వచ్చిన పాపులారిటీతో సోషల్ మీడియాలో స్రవంతి కుమ్మేస్తోంది. గతంలో కూడా స్రవంతి తన హాట్ ఫోటోలను షేర్ చేసేది. కానీ ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ అన్నట్లుగా ఈ అమ్మడు రెచ్చి పోతుంది. హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గకుండా ఈమె తన అందాలతో సోషల్ మీడియా లో జనాలకు హీట్ పెంచుతోంది. అందమైన ఈ అమ్మడి ఫిజిక్ తో పాటు మంచి బాడీ లాంగ్వేజ్ వల్ల హీరోయిన్ మాదిరిగా ఉందనే కామెంట్స్ కూడా వస్తున్నాయి. బిగ్ బాస్ తో గుర్తింపు దక్కించుకున్న అషు రెడ్డి.. దివి ఇంకా చాలా మంది కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను విపరీతంగా పెంచుకుంటున్నారు. అయితే వారిలో ఎక్కువ శాతం మంది పెళ్లి కాని వాళ్లు ఉన్నారు. అయితే స్రవంతి కి పెళ్లి కావడంతో కొందరు ఈ అందాల ఆరబోత ఫోటోలను విమర్శిస్తూ ఉన్నారు. సినిమాల్లో నటిగా ఈమె కు ఆఫర్లు చిన్నా చితకా సినిమాల నుండి వస్తున్నాయనే వార్తలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతానికి సోషల్ మీడియాలో సందడి చేస్తున్న ఈమె బుల్లి తెర మరియు వెండి తెర ద్వారా పాపులారిటీని మరింతగా పెంచుకుని స్టార్ గా నిలుస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com